


కుప్పం మహిళకు రక్షణ కల్పించాలి : ఐద్వా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ ముఖ్యమంత్రి నియోజకవర్గం కుప్పంలో దాడికి గురైన శిరీషకు రక్షణ కల్పించాలని, ఆమె అప్పు రద్దు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి డిమాండ్‌చేశారు. ఆమె భర్త అప్పు తీసుకుంటే, ఆమెను చెట్టుకు కట్టేసి కొట్టడాన్ని ఖండించారు. నిందితుడు మునిరత్నం, అతని కుమారుని కఠినంగా శిక్షించాలని, వారినుంచి ఆ కుటుంబానికి రక్షణ కల్పించాలని, అప్పును సంపూర్ణంగా రద్దు చేయాలని కోరారు. ఈ ఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోందని, ఓ మహిళను పాశవికంగా దాడి చేయడం చూస్తుంటే మహిళా సాధికారిత ఏవిధంగా వెలిగిపోతుందో అర్థమవుతోందన్నారు.

టిడిపి కార్యకర్త మునికన్నప్పపై కేసు నమోదు

మంగళవారం బిఎన్ఎస్ 341/323/324/506/34/ఐపిసి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మునికన్నప్పను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుప్పం మహిళ శిరీషను ముఖ్యమంత్రి స్వయంగా పరామర్శించి 5 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పిల్లల చదువుకు హామీ ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు.

మామిడి రైతులకు రూ.170 కోట్ల సాయం

- చివరి కాపు వరకూ ప్రభుత్వం అండ
- 40శాతం అధికంగా పంట దిగుబడి
- 24X7 హెల్ప్ లైన్ 0877- 2236007
- మీడియాతో కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది అధిక ఎరువులు వాడటం వల్ల తోతాపురి అధిక దిగుబడి వచ్చిందని, రుతుపవనాల ప్రభావం కారణమని, మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాణ్యతతో కూడిన దిగుబడి కోసం రైతులు వాడిన ఎరువుల ప్రభావం వల్ల 40శాతం పంట దిగుబడి పెరిగిందన్నారు. ఇలాంటి వాతావరణమే గతంలో 2018లోనూ ఉత్పన్నమైనపుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతుల పక్షాన నిలబడిందని గుర్తు చేశారు. ఉక్రెయిన్ యుద్ధం వల్ల యాజమాన్యాలు రైతుల వద్ద తోతాపురి మామిడి తీసుకోడానికి వెనకడుగు వేస్తున్నాయన్నారు. గత ఏడాది పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక నుంచి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి మామిడి చేరడంతో ఆ పల్ప్ నిల్వ ఉండిపోయిందన్నారు. తాజాగా మామిడి రైతుల గిట్టుబాటు ధరపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు దృష్టికి తీసుకెళ్లగా గుజ్జు పరిశ్రమల నుంచి రూ.8, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రూ.4 చొప్పున మొత్తం కలిపి రైతుకు రూ.12 ఇవ్వాలని నిర్ణయించామన్నారు. రైతులకు అందించే సబ్సిడీ సాయాన్ని 160-170 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ల వల్ల రైతులకు ఏదైనా ఇబ్బందులు కలిగితే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో ఎనిమిది మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా రోజుకు 2వేల మెట్రిక్ టన్నులు ప్రాసెసింగ్ జరుగుతుందన్నారు. 27 కలెక్షన్‌ర్యాంపులు, రెండు వ్యవసాయ మార్కెట్ యార్డుల సేకరణ ద్వారా జరుగుతున్న ప్రాసెసింగ్‌ను అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారన్నారు. గుజ్జు ఫ్యాక్టరీల ముందు పరిస్థితిని సమీక్షించడానిక రెండు డ్రోన్‌కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. చివరి కాపు వరకూ రైతులు వేచి ఉండాలని, తొందరపడి కాపును కోసి గుజ్జు పరిశ్రమలకు వెళ్లొద్దని సూచించారు. మామిడి రైతులు నష్టపోకుండా టిటిడి, అంగన్‌వాడీ సెంటర్లకు మామిడి పల్ప్ అందివ్వాలన్న సలహాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లామన్నారు. తోతాపూరి మామిడి రైతులకు సహాయార్థంగా జిల్లా కలెక్టరేట్లు 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, రైతులకు సంబంధించి ఏ సందేహం ఉన్న ఈ హెల్ప్ లైన్ 0877- 2236007 సంప్రదించాలని కోరారు. ఈ-పంటలో నమోదైన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతుకు సబ్సిడీ సాయాన్ని అందిస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్స్‌ను పరిశీలించిన కలెక్టర్



శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్స్‌లో కలెక్టర్

ప్రజాశక్తి - రేణిగుంట

మామిడిపండ్ల గుజ్జు తయారీ పరిశ్రమల వద్ద టోకెన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ పరిశ్రమల యజమానులకు సూచించారు. మంగళ వారం రేణిగుంట మండలం ఎస్ఎన్ పురం గ్రామంలోని శ్రీ వర్ష ఫుడ్ ప్రొడక్ట్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన మామిడి పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తోతాపురి మామిడకాయలను తీసుకువచ్చిన రైతులకు ముందు వచ్చిన రైతులకు ముందుగా టోకెన్ జారీ చేసే పద్ధతిని ప్రవేశపెట్టాలని సూచించారు. ముందుగా ఒక ట్రాక్టర్ మామిడికాయలను ఎంత బరువు ఉంటుందో పరిశ్రమలోని వే బ్రిడ్జి వద్ద బరువును పరిశీలించారు. రైతులు తీసుకువచ్చే మామిడి కాయలను నమోదు చేసే ప్రక్రియను సంబంధిత ఉద్యానవన శాఖ అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. శ్రీ వర్ష ఫుడ్ ప్రోడక్ట్ ఇండియా లిమిటెడ్ చైర్మన్ విశ్వనాథ నాయుడు తమ యూనిట్లో 250 నుండి 300 టన్నులవరకు నిల్వ ఉంచుకొనే సామర్థ్యం ఉందని తెలిపారు. ప్రస్తుతం 15 రైపనింగ్ చాంబర్స్ లో పూర్తిస్థాయిలో మామిడికాయలు నిల్వలు ఉన్నాయన్నారు. అందుకనే తాము ఇంకా రైతుల వద్ద నుంచి మామిడి కాయలను అన్లోడ్ చేయలేదన్నారు. అక్కడే ఉన్న మామిడి రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తోతాపురి మామిడికాయల రైతులను ఆదుకునేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ముందుగా స్థానిక రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత పల్ప్ యూనిట్ల యజమానులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీడీ సతీష్, మార్కెటింగ్ ఎడి సురేంద్రబాబు, స్థానిక తహసిల్దార్ సురేష్ బాబు పాల్గొన్నారు.

బడులకు 'బీగాలు'



దొరవారిసత్రంలో..

'విలీనం' వద్దంటూ నిరసనలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

విద్యా సంవత్సరం ప్రారంభమైనా 'విలీన' బడులు వివాదాస్పదమయ్యాయి. 'తమ పిల్లలకు భద్రత ఉండాలంటే.. మా ఊళ్లోనే మా బడి ఉండాలి' అంటూ గ్రామస్తులు చైతన్యపూరితంగా నిరసనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో స్కూళ్లకు తాళాలు వేసి తరగతి గదులు జరగకుండా నిరసనలు కొనసాగిస్తున్నారు. పుత్తూరు రూరల్ నేషనూర్ వడ్డిండ్లులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రెండు అంతస్తుల భవనం ఉంది. 30 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఇద్దరు టీచర్లు ఉన్నారు. అయితే ఈ పాఠశాలను నేషనూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. దీంతో తల్లిదండ్రులు గ్రామస్తులతో కలిసి ధర్నా నిర్వహించారు. వెంకటరత్నం మాట్లాడుతూ తమ పిల్లలు 2.5 కిలోమీటర్ల దూరం నడచి వెళ్లాల్సి వస్తోందన్నారు. పుత్తూరు రింగ్‌రోడ్డు దాటుకుని వెళ్లాలంటే పిల్లలకు భద్రత ఉండదన్నారు. విలీనం చేయొద్దని చెబుతూనే ఉన్నా ఎంఇఒ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామస్తుల ఆమోదం లేకుండా స్కూలు ఎలా మూసివేస్తారని ప్రశ్నించారు. తమ పిల్లల్ని ప్రైవేట్ స్కూళ్ల వాళ్ల పంపమని కోరినా పంపలేదన్నారు. పాఠశాల మూసేస్తే మా పిల్లలు చదువులేని వారిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. దయ ఉంచి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చాముండేశ్వరి, మణి, బాబు, హంస, భారతి, పుణ్యవతి, నేషనూరు వడ్డిండ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

- యర్రావారిపాలెం మండలం పుస్తికాయలపెంట పంచాయతీ కస్పా గ్రామంలో ఎలిమెంటరీ స్కూలు విద్యార్థులు నిరసన తెలిపారు. పులిచర్లవారిపల్లి స్కూలుకు విలీనం చేయడంతో తల్లిదండ్రులు ఎంఇఒ దృష్టికి తీసుకెళ్లారు. డిఇఒతో మాట్లాడి గ్రామస్తులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించుకున్నారు.

- దొరవారిసత్రంలో.. ప్రాథమిక పాఠశాలను ఏకొల్లు స్కూల్లో విలీనం చేశారు. దాదాపు రెండు కిలోమీటర్ల దూరం తమ పిల్లలు వెళ్లలేరని, జాతీయ రహదారిపై వెళ్లాలంటే భద్రత ఉండదని తల్లిదండ్రులు వాపోతున్నారు. తామంతా కూలి పనులు చేసుకునేవాళ్లమని పిల్లల్ని వదిలి, మళ్లీ స్కూలుకు తెచ్చుకోవాలంటే ఇబ్బంది అవుతుందన్నారు. పిల్లల్ని బడికి పంపాలంటే తాము కూలి పనులైనా మానుకోవాలని, లేదంటే పిల్లల్ని బడి అయినా మాన్పించాలన్నారు. సోమవారం వినతిపత్రాన్ని ఎంఇఒ కృష్ణయ్యకు సమర్పించారు. విలీనాన్ని వెనక్కి తీసుకోకపోతే తమ పిల్లలంతా డ్రాపౌట్లు అవుతారని తెగేసి చెప్పారు.

కూటమి ఏడాది పాలన 'వైఫల్యాల పుట్ట'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



కూటమి ఏడాది పాలన 'వైఫల్యాల పుట్ట'గా మారిందని సిపిఎం జిల్లా నేత కందారపు మురళి విమర్శించారు. మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ప్రచురించిన 'కూటమి ఏడాది పాలన బుక్‌లెట్'ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్, మాధవ్, బుజ్జి, నరేంద్ర, రమేష్, జయంతి పాల్గొన్నారు. కందారపు మురళి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోడీతో జతకట్టిన టిడిపి, జనసేన నేతలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి అదానీ, అంబానీలకు ప్రజల సంపదను కొల్లగొట్టి ధారాదత్తం చేస్తున్నారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వివాదాలకు కేంద్రంగా మార్చేశారని, స్వల్ప కారణాలన చూపి మత ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని అన్నారు. కార్మికులకు పని గంటలు 10 నుంచి 12 గంటలకు పెంచిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానికే దక్కిందన్నారు. కనీస వేతనాలు గతత 15 ఏళ్లుగా పెంచలేదన్నారు. దీంతో కష్టజీవుల్లో కొనుగోలు శక్తి తగ్గిందన్నారు.



ఈస్టు పోలీసు స్టేషన్ సమీపంలోని చాళుక్య లాడ్జి స్థలం అమ్మకానికి

అమ్మకానికి 'కార్పొరేషన్' స్థలాలు

- స్మార్ట్‌సిటీకి రాష్ట్రవాటా ఇవ్వని వైనం
- కొత్త 'కార్యాలయానికి' నిధుల లేమి
- 84 అంశాలతో జంబో అజెండా
- నేడు తిరుపతి కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఎస్వీసెనేట్ హాలులో మూడు నెలల తర్వాత జరగనుంది. దాదాపు 84 అంశాలతో జంబో అజెండాతో సమావేశం జరగనుంది.

తిరుపతి స్మార్ట్ సిటీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం 406 కోట్ల రూపాయలు మున్సిపల్ కార్పొరేషన్‌కు ఇవ్వాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఈ నిధులు ఇవ్వకపోవడంతో తిరుపతి కార్పొరేషన్ అభివృద్ధికి పెనుభరంగా మారింది. నిధులు ఇవ్వకపోగా కార్పొరేషన్ ఆస్తులు అమ్మి అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వం ఉచిత సలహా ఇస్తుంది. తిరుపతి కార్పొరేషన్‌లో చాలా వరకూ స్థలాలు కబ్జాకు గురయ్యాయి. కార్పొరేషన్‌కు అంటూ సొంత స్థలాలు ఏవీ లేవు. స్మార్ట్ సిటీ పథకంలో జరుగుతున్న పనులు చాలా వరకు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రధానంగా నిధులే సమస్య.

స్థానిక సమస్యలపై కౌన్సిల్ అధికారులను నిలదీసే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. వివాదాస్పదంగా మారిన తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన చాళుక్య లాడ్జ్ స్థలం అమ్మ రాదని కార్పొరేటర్లు ఎక్కువమంది డిమాండ్ చేస్తున్నారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న కార్పొరేషన్ స్థలం గతంలో చాళుక్య లాడ్జికి లీజుకు ఇచ్చారు. లీజు ముగిసిపోయి కొన్ని సంవత్సరాలు అవుతుంది. 1967వ సంవత్సరంలో అది మున్సిపల్ స్థలం. ఒకప్పుడు గెస్ట్ హౌస్ గా ఉండేది. 1983 లో చాళుక్య లాడ్జికి లీజుకి ఇచ్చారు. 33 సంవత్సరాలు లీజుకాలం ముగిసింది. అయితే భవనం ప్రస్తుతం శిథిలావస్తలో ఉంది. కొంత స్థలం ఈస్ట్ పోలీస్ స్టేషన్ నిర్మించేశారు. సుమారు 100 అంకణాలు పైగా ఉన్న కార్పొరేషన్ స్థలం అమ్మకానికి పెట్టి వచ్చిన డబ్బులతో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కొత్త కార్యాలయం నిర్మాణానికి వినియోగించాలని కమిషనర్ భావిస్తున్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా ఈ స్థలం అమ్మి కార్పొరేషన్ కొత్త కార్యాలయానికి ఖర్చు చేయాలని సూచించినట్లు తెలుస్తోంది. బుధవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో ఎక్కువ మంది కార్పొరేటర్లు ఈ స్థలాన్ని అమ్మ రాదని, కార్పొరేషన్ అవసరాల కోసం వినియోగించుకోవాలని కోరుతున్నారు. మరికొందరైతే ఈ స్థలాన్ని అంకణం 15 నుంచి 20 లక్షలు ధర నిర్ణయించి అమ్మాలని కోరుతున్నారు. కొత్త కార్పొరేషన్ కార్యాలయం పూర్తి కావడానికి ప్రస్తుతం 60 కోట్ల రూపాయల డబ్బులు కావాల్సి ఉంది. స్మార్ట్ సిటీ నుండి పథకం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం 406 కోట్ల రూపాయలు డబ్బులు ఇవ్వాల్సి ఉంది. స్మార్ట్ సిటీ డబ్బులు ఇవ్వకపోవడంతో కార్పొరేషన్ అభివద్ధిపై ప్రభావం పడింది. ఇప్పటికే 2025-26 సంవత్సరానికి 18 కోట్ల 50 లక్షల రూపాయలు పన్ను లు విధించడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్మార్ట్ సిటీ పథకంలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించింది. గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా టెండర్ పనులు పిలిచారు.. ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు సుమారు 60 కోట్ల రూపాయలు పాత బకాయిలు ఇవ్వాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లించలేని పరిస్థితిలో కార్పొరేషన్ ఉంది. బుధవారం జరగనున్న కౌన్సిల్లో 84 అంశాలు అజెండాలు పొందుపరిచారు. 2023వ సంవత్సరంలో స్మార్ట్ సిటీ ఉత్తమ క్లీన్ సిటీ అవార్డు దక్కించుకుంది. యాభై మంది పారిశుధ్య కార్మికులను ముంబాయిలో చెత్తసేకరణ ఎలా చేస్తున్నారు? అనే విషయమై ఐదు రోజుల పాటు శిక్షణకు వెళ్లనున్నారు. దీనికోసం 12 లక్షల 50 వేల రూపాయలు ఖర్చు చేయనున్నట్లు అజెండాలో పొందుపరిచారు. దాంతోపాటు 50 డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాల కోసం కాంట్రాక్టు పనులకు వెచ్చించాల్సి ఉంది.

ఇజ్రాయిల్ పాశవిక దాడులు ఆపాలి

సామ్రాజ్యవాదంపై వామపక్షాల నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆయుధాల వ్యాపారం, ఖనిజ వనరుల దోపిడీ, సామ్రాజ్యవాదమే లక్ష్యంగా చిన్న దేశాలపై అమెరికా చేయిస్తున్న సైనిక దాడులు నశించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యాదర్శి గంధం మణి అన్నారు. అగ్ర రాజ్యం అమెరికా ప్రోద్బలంతో గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న ఊచకోతను వెంటనే ఆపాలని కోరారు. పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చేస్తున్న పాశవిక దాడులకు వ్యతిరేకంగా స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. గంధం మణి మాట్లాడుతూ పాలస్తీనాపై ఇరవై మాసాలకు పైగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో 55 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారని వాపోయారు. వీరిలో చిన్నారులు, మహిళలు, వద్దులు అధికంగా అశువులు బాశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోత్సాహంతో చిన్నదేశాలైన ఇరాన్, పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి చేస్తున్నా ఖండించలేని దుస్థితిలో భారత ప్రభుత్వం



ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ఇరాన్, ఇజ్రాయిల్ పట్ల ద్వంద వైఖరిని అవలంభిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇజ్రాయెల్, అమెరికా విధానాల పట్ల సూత్రబద్ధమైన వైఖరి తీసుకోవాలని సూచించారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించి ఇజ్రాయిల్‌కు సైనిక, భద్రతా సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పెనగడం గురవయ్య, అన్వర్ బాషా, గురునాథం, ఈశ్వరయ్య, రాజా తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంటలో...పాలస్తీనా- ఇరాన్‌పై ఇజ్రాయిల్ మారణకాండను ఆపాలని, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధానికి భారత సైనిక సహకార ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమని వామపక్షాలు, లౌకిక పరిరక్షణ వేదిక నాయకులు ఉద్ఘాటించారు. 'పాలస్తీనా సంఘీభావ దినం' పురస్కరించుకుని రేణిగుంట అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నాయకులు ఎస్.షానవాజ్, మహ్మద్ వల్లి, కరీముల్లా, బాష, నిజాముద్దీన్, దిలీప్, బాష, ఆషా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జూలియన్‌రాజు, సిపిఐ నాయకులు తెలసిరాజన్, సిపిఎం నాయకులు ఈశ్వరమ్మ, రాజేశ్వరి, రాజశేఖర్, సెల్వరాజ్, ఓ.వెంకటరమణ, హరినాథ్ పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్‌లో.. అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. సిపిఎం, సిపిఐ పట్టణ నాయకులు వెంకటేష్, మహేష్ నాయకత్వంలో విజయ్, రమేష్, బాష, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

- గూడూరు టౌన్‌లో.. పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. యుద్ధం మంచిది కాదని సిపిఎం నాయకులు జోగి శివకుమార్, వి.భాస్కర్‌రెడ్డి, మురళి సూచించారు.

టిటిడి విద్యాసంస్థల్లో సనాతన ధర్మం శిక్షణ

- శ్రీవాణి ట్రస్టు నిధులతో దళితవాడల్లో ఆలయాలు
- చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన ఏడు పాఠశాలల్లో 1600 మంది విద్యార్థులకు సనాతన ధర్మం, తెలుగు సాంస్కృతిక వైభవం, మానవీయ విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చైర్మన్ బిఆర్‌నాయుడు వెల్లడించారు. సమరసత్తా ఫౌండేషన్ సహకారంతో అర్చక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. సనాతన ధర్మ పరిరక్షణకు, హిందూ ధర్మ వ్యాప్తికి ఏడాదికి రూ.120 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం మంగళవారం జరిగింది. అనంతరం మీడియాకు ధర్మకర్తల మండలి తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వివరించారు. త్వరలోనే తిరుపతిలో సిఎస్ఆర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామని, నెయ్యి, నీరు, పప్పుధాన్యాల నాణ్యత పరిశీలించవచ్చన్నారు. శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా దళితవాడల్లో ఆలయాలు నిర్మించడానికి తీర్మానం చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 141 ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం అందించామన్నారు. టిటిడి కళాశాలల్లో ఏళ్ల తరబడి లెక్చరర్లుగా పనిచేస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రికి సూచించామన్నారు. త్వరలోనే దేవాదాయ శాఖ మంత్రి, ఈవో, చైర్మన్లు కమిటీగా ఏర్పడి నిర్ణయం తీసుకుంటామన్నారు. మరి కొన్ని నిర్ణయాలను ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించారు. తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి శ్రీ వెంకటేశ్వర ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా పేరు పెట్టాలని కేంద్ర విమానయాన శాఖకు ప్రతిపాదన పంపించాలని నిర్ణయించామని, ఆధ్యాత్మిక శోభ తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వరలక్ష్మి వ్రతం పర్వదినాన 'సౌభాగ్యం' పేరుతో తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విలేకరుల సమావేశంలో బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, నరేష్‌కుమార్, శాంతారాం, జానకిదేవి, ఎక్స్‌అఫిషియో సభ్యులు డాలర్స్ దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుపతి జిల్లా రెవెన్యూలో బదిలీలు

19 మంది తహశీల్దార్లు, 15 మంది డిటిలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి జిల్లాలో పలువురు తహశీలార్దర్లను, డిప్యూటీ తహశీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు.


పనిచేస్తున్న ప్రాంతం	పేరు	బదిలీ ప్రాంతం
తిరుపతి అర్బన్	భాగ్యలక్ష్మి	చిన్నగొట్టిగల్లు
రేణిగుంట	సురేష్‌బాబు	తిరుపతి అర్బన్
చిన్నగొట్టిగల్లు	జనార్దన్‌రాజు	శ్రీకాళహస్తి
తిరుపతి కలెక్టరేట్	ఎం.రోశయ్య	కెవిబిపురం
పిచ్చాటూరు	వై.రమేష్‌బాబు	కలెక్టరేట్‌కు
చిత్తూరు అర్బన్	జి.చంద్రశేఖర్‌రెడ్డి	రేణిగుంట
తిరుపతి కలెక్టరేట్	పి.భారతీయుడు	తొట్టంబేడు
తొట్టంబేడు	యు.మధుసూదన్‌రావు	తిరుపతి కలెక్టరేట్
సత్యవేడు	టివి సుబ్రమణ్యం	పిచ్చాటూరు
పిచ్చాటూరు	పి.రాజశేఖర్	సత్యవేడు
శ్రీకాళహస్తి	శ్రీదేవి	బిఎన్ కండ్రిగ
శ్రీకాళహస్తి	ఉన్న లక్ష్మీనారాయణ	తిరుపతి కలెక్టరేట్
శ్రీకాళహస్తి డిటీ	ఈ.శాంతి	శ్రీకాళహస్తి డిఎఒ
సూళ్లూరుపేట	ఎస్వీ నరసింహారావు	వెంకటగిరి
వెంకటగిరి	కె.సతీష్‌కుమార్	చిట్టమూరు
పెళ్లకూరు	ద్వారకనాథరెడ్డి	తిరుపతి కలెక్టరేట్
నెల్లూరు జిల్లా	ఉన్నసయ్యద్ ఇక్బాల్	తిరుపతి కలెక్టరేట్
చిల్లకూరు డిటి	కె.శ్రీనివాసులు	చిల్లకూరు తహశీల్దార్‌గా
తిరుపతి అర్బన్ డిటి	రామచంద్రయ్య	జిల్లా డిఎస్ఒ కార్యాలయం

'పూడి-ఏర్పేడు' రైల్వేలైన్‌కు మహర్దశ

ఉత్పత్తుల రవాణాకు అనుకూలంగా...

- 25.4 కిలోమీటర్ల రైల్వే లైను
- 490.97 కోట్లు నిధులు మంజూరు
- రైల్వే జంక్షన్‌గా పూడి
- చెల్లూరు సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు

ప్రజాశక్తి -ఏర్పేడు



'ఏర్పేడు-పూడి' రైల్వే స్టేషన్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రైల్వే బోర్డు ఇటీవల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల నుంచి ఉత్తర భారత దేశంలోని ప్రధాన నగరాలకు తక్కువ సమయంలో వస్తు రవాణా చేయడానికి ఈ నూతన మార్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వస్తు రవాణా చేసే గూడ్స్ రైళ్లు సదరన్ రైల్వే నుంచి ఉత్తర భారతదేశంలోని ప్రధాన నగరాలకు వస్తు రవాణా చేయడానికి రేణిగుంట రైల్వే జంక్షన్ ద్వారా వెళ్లాల్సి ఉంది. రేణిగుంట రైల్వే జంక్షన్ రద్దీగా మారడంతో కొంత ఆలస్యం జరుగుతున్నదని రైల్వే బోర్డు అధ్యయనం చేసి ఏర్పేడు, రేణిగుంట, వడమాల పేట మండలాలలోని కొన్ని గ్రామాల ద్వారా పూడి రైల్వే స్టేషన్ కు నూతన రైల్వే మార్గం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ రైల్వే లైను పూర్తి అయితే రేణిగుంట రైల్వే జంక్షన్ లో రైళ్ల రాకపోకలకు ఒత్తిడి తగ్గనుంది. పూడి రైల్వే స్టేషన్ను జంక్షన్ గా పునరుద్ధరించి, చెల్లూరు సమీపంలో ఓ రైల్వే స్టేషన్ కూడా ఏర్పాటు చేయనున్నారు.

జిల్లా రెవెన్యూ శాఖ ప్రాథమిక సర్వే పూర్తి చేసి 25.4 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఏర్పేడు మండలంలో మొత్తం ఎనిమిది గ్రామపంచాయతీలకు గాను ఎకరాలు177.6 సెంట్లు రైల్వే లైన్‌కి తీసుకోనుంది. ఈ రైల్వే లైన్ మార్గాన్ని ఏర్పాటు చేయడానికి ఇటీవల కేంద్రం 490.97 కోట్లు నిధులును మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టును నాలుగు సంవత్సరాల కాల పరిమితిలో పూర్తి చేయనున్నారు.

విలీన గ్రామాల మీదుగా:

పూడి -ఏర్పేడు నూతన రైల్వే మార్గం ఏర్పేడు మండలంలోని 8 గ్రామపంచాయతీలు కు గాను చిన్న అంజిమేడు సర్వేనెంబర్ 17 లో ఎకరాలు 22.48 సెంట్లు, మాధవ మాల సర్వే నంబర్ 33లో ఎకరాలు 25.27 సెంట్లు, కోబాక సర్వే నెంబర్ 4 లో ఎకరాలు 7.91 సెంట్లు , ఎండి పుత్తూరు, మునగల పాలెం కలుపుకొని సర్వేనెంబర్ 26 లో 25.19 సెంట్లు, చెల్లూరు సర్వేనెంబర్ 27 లో ఎకరాలు 33.77 సెంట్లు , గుడిమల్లం సర్వే నంబర్ 21 లో ఎకరాలు50.0 సెంట్లు, పెనుమల్లం సర్వేనెంబర్ 15 ఎకరాలు 12.98 సెంట్లు కలుపుకొని రేణిగుంట మండలంలోని రెండు గ్రామాలు, వడమాల పేట మండలంలోని రెండు గ్రామాలు మీదుగా పూడి కి రైల్వే లైన్ ఏర్పాటు చేయనున్నారు.

ఉత్పత్తుల రవాణాకు అనుకూలంగా:

అటు నూతన రైల్వే జంక్షన్ గా పూడి, ఇటు రేణిగుంట రైల్వే జంక్షన్ రద్దీ తగ్గడం, మరో నూతన రైల్వే స్టేషన్ చెల్లూరు పరిసర ప్రాంతాల్లో నిర్మించడంతో పరిసర ప్రాంతాల్లోని రైతులు పండించే ఉత్పత్తులు సుదూర ప్రాంతాలకు రవాణా చేసే అవకాశాలు పెరుగుతుంది. రేణిగుంట, ఏర్పేడు మండలాలలో ఉన్న భారీ పరిశ్రమల ఉత్పత్తులు కూడా రవాణా చేయుటకు అనుకూలంగా మారనుంది. చెల్లూరు సమీపంలో నూతన రైల్వే స్టేషన్ రావడంతో దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి శివాలయం గుడిమల్లం ఆలయ ధర్శనార్థం భక్తులకు సులువైన మార్గం కానుంది.

భూముల పరిహారం పెంచండి: : రైతులు

రైల్వే మార్గానికి తీసుకునే భూములకు పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి ఇవ్వాలని స్థానిక రైతులు ఎంపి మద్దెల గురుమూర్తిని గతంలోనే విన్నవించారు. రైల్వేలైన్ సర్వేలు పూర్తయ్యాయి. రెవెన్యూ అధికారులు భూపరిహారం విషయంలో జిమ్మిక్కులు చేసి పదేళ్ల మార్కెట్ రేటును పరిగణనలోకి తీసుకుని దానికి మూడింతలు చేయడం వల్ల పరిహారం తక్కువగా వస్తుందని రైతులు వాపోతున్నారు. పొలాల మధ్యలో రైల్వేలైన్ రావడం వల్ల పొలాలకు మార్కెట్ ధర తగ్గుతుందని, దీనిని పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి ఇవ్వాలని కోరుతున్నారు. అభివృద్ధి పేరుతో తమ పొలాలు తీసుకుని తమకు అన్యాయం చేయొద్దని రైతు పురుషోత్తంరెడ్డి వాపోయారు.



భూములను సర్వే చేస్తున్న సర్వే బృందం (ఫైల్)

అంగన్వాడి పిలుస్తోంది

ప్రజాశక్తి -దొరవారిసత్రం :మండల పరిధిలోని ఏకొల్లులో మంగళవారం 'అంగన్ వాడి పిలుస్తుంది' కార్యక్రమాన్ని అంగన్వాడి సూపర్వైజర్ అంకమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని 3 సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో ప్రీ స్కూల్ నమోదు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు లీలమ్మ ప్రసన్న, పిల్లలు, తల్లిదండ్రులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి - తొట్టంబేడు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ, కల్లిపుడిలో మంగళవారం సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పాల్గొన్నారు. మొదటగా శ్రీకాళహస్తి సి.ఐ.టి.యు ప్రాంతీయ సభ్యులు 5 టీమ్‌లుగా విడిపోయి కల్లిపుడిలో ఉన్న 150 కుటుంబాలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఈ గ్రామస్తులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పంటలు పండించడానికి భూములు లేకపోవడంతో బంగారు మట్టి పనిని ఆధారంగా చేసుకుని బతుకుతున్నారన్నారు. వీరికి ప్రభుత్వం భూములు ద్వారా రుణాలిచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సి.పి.ఎం పార్టీ పట్టణ బాధ్యుడు గంధం మణి, సి.ఐ.టి.యు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, సి.ఐ.టి.యు ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, గురునాథం, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీతాల బకాయిలు చెల్లించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలను వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరు, సీపీఐ కార్యాలయంలో ఏపీ మెడికల్ శానిటేషన్ కాంట్రాక్ట్ యూనియన్ కార్మికుల పార్టీ శాఖ మహా సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు ప్రభాకర్, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్‌లు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీపీఐ లక్ష్యమన్నారు. అనంతరం ఏపీ మెడికల్ శానిటేషన్ కాంట్రాక్ట్ యూనియన్ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా చెంగమ్మ, సహాయ కార్యదర్శిగా సెల్వియను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి నియోజక వర్గ కార్యదర్శి నారాయణ, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు బాలే మస్తాన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ భూముల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:మండలంలోని, ఆలత్తూరు రెవెన్యూ పరిధి, పాలేరు గ్రామ రెవెన్యూ భూములను మంగళవారం సూళ్లూరుపేట డివిజనల్ అధికారిణి కిరణ్మయి పరిశీలించారు. ఈ భూముల వివరాలను తాసిల్దార్ శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. ఈ భూముల విషయంలో రైతులకు తగు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రబాబు నాయుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నల్లయ్య వీఆర్వో భాస్కర్ పాల్గొన్నారు.

జిల్లా క్రీడా అధికారికి సత్కారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్గా బాధ్యతలు చేపట్టిన శశిధర్ కి తిరుపతి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడుతూ ప్రతి క్రీడాకారునికి, క్రీడా సంఘానికి అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అసోసియేషన్ అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి ఆర్.శ్రీధర్, కోశాధికారి సాయికుమార్, ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డప్ప, శాప్ కోచ్లు మాలిని, ఆది, ప్రేమ్, గోపి, హరి, హిందూజా తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కండలేరు నుండి వేములపాలెం వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వరకు ఉన్న మెయిన్ లైన్కు మూడు చోట్ల లీకులు ఏర్పడిన కారణంగా మెయిన్ లైన్ మరమ్మతులు జరుగుతుండడంతో గూడూరు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ అడ్మిషన్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే రమణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను అందరూ ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలన్నారు. కళాశాలలో తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లో విద్యా బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు ఆసక్తి మేరకు ఎంపీసీ, బైపీసీ,హెచ్ఈసీ, సిఈసి,ఎంపీహెచ్ కోర్సుల్లో చేరవచ్చున్నారు.

కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం కళాశాల మ్యాగజైన్ ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థినులు, అధ్యాపకుల లోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రతి సంవత్సరం కళాశాల మ్యాగజైన్ను వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణవేణి, సునీత శ్రీ, సుధారాణి, సైకాలజీ భర్మణి, ఇన్నార్ల జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులకు ఏబిఆర్ఎస్ఎం వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ :యస్వీయులో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న అర్హులైన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని ఏబిఆర్ఎస్ఎం నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం యస్వీయు ఇంచార్జి విసి సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అధికారులు మాట్లాడుతూ వీలైనంత త్వరగా సియఎస్ పదోన్నతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏబిఆర్ఎస్ఎం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వై. వి. రామిరెడ్డి, రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ రామశేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ రమేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు పరిధిలో ఉన్న డిగ్రీ, లా, పిజి పరీక్షల ఫలితాలు సకాలంలో విడుదల చేయాలని, విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, అకాడమిక్ షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించక పోవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, రవి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి మంగళవారం వర్సిటీ ఇంచార్జి విసి ఆచార్య అప్పారావుకి వినతిపత్రం ఇచ్చారు. ఇంచార్జి వీసీ స్పందించి ఇకపై ఇలాంటి సమస్యలు ఉండవని, ఇకపై పరీక్షల వాల్యువేషన్ ఆఫ్లైన్లో టిసిఎస్ కు అప్పగించామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్టూడెంట్ అశోక్, యూనివర్సిటీ కార్యదర్శి వినోద్, జిల్లా నాయకులు బాల, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో స్వర్ణ పతకం

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు, న్యాయ కళాశాలలో 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు రెండవ సంవత్సరం చదువు తున్న పి. హేమ వెంకట్ నారాయణ మైసూరులోని అవధూత శ్రీ దత్త పీఠం నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో స్వర్ణ పతకం లభించింది. మంగళవారం శ్రీదత్త పీఠం పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆయనకు స్వర్ణ పతకం అందజేశారు.

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్విమ్స్ కార్మికుల సమస్యలపై సమ్మెలోకి వెళ్లడానికి పారిశ్రామిక వివాద చట్టం ప్రకారం కార్మిక శాఖకు, స్విమ్స్ యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. నేటికీ రెండు వారాలు గడచినా, సమస్య పరిష్కారం కాకపోవడంతో మంగళవారం ఉదయం ఎంఆర్ పల్లి లోని డీసీఎల్ కార్యాలయం వద్ద స్విమ్స్ కార్మికులు, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నా వద్దకు డీసీఎల్, ఏసిఎల్ ఇరువురు వచ్చి స్విమ్స్ యాజమాన్యాన్ని పిలిపించడం జరిగిందని, యూనియన్ నాయకులతో చర్చలు ప్రారంభిద్దామని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్చల్లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వేణుగోపాల్, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.మాధవ్, సిఐటియు నగర అధ్యక్షులు టి.సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు పి.బుజ్జి, ఎండి శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు. వారం రోజుల్లో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 24వ తేదీ వరకు గడువు ఉందని, అప్పటివరకు నల్ల రిబ్బన్ బ్యాడ్జీలతో డ్యూటీ చేయడం జరుగుతుందని, 24 తర్వాత సమస్యలు పరిష్కారం కాకపోతే 25 నుండి సమ్మెలోకి వెళతామని కార్మిక నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రవి, సూరి, మారి ముత్తు, గోపి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మయూరి శ్యామ్ యాదవ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరుకు చెందిన డాక్టర్ బండి శ్యాంసుందర్ రావు (మయూరి శ్యామ్ యాదవ్)ను నియమించారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజ యాదవ్ రాష్ట్ర నేతలు రాయి రమణయ్య , డాక్టరు గుండాల సురేంద్ర, రజిని, పద్మమ్మ, బిసి నాయకులు పాల్గొన్నారు.

ఆదిశంకరాలో హెచ్‌సిఎల్ ప్లేస్ మెంట్ డ్రైవ్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్‌సిఎల్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశంకర కళాశాల చైర్మన్ వంకీ పెంచలయ్య మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో 40 మంది విద్యార్థులు ఎంపికైనారని తెలిపారు. వారికి వార్షిక వేతనం 2.24 నుండి 2.77 లక్షల రూపాయల వరకు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్పర్సన్ వంకీ అనూష, కళాశాల డీన్ వేణుమాధవ్, శ్రీనివాస్, టిపిఒ అర్చన , కంపెనీ ప్రతినిధులు సత్యేంద్ర బంసాల్, బినీత్ కుమార్‌లు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ కేన్సర్ కేర్ బ్లాక్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మెమోరియల్ సెంటర్ (టీఎంసీ) నూతనంగా ఏర్పాటు చేయనున్న అడ్వాన్స్ క్యాన్సర్ కేర్ బ్లాక్‌కు ఐసీఐసీయు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ బాత్ర, టాటా మెమోరియల్ సెంటర్ (ముంబై) డైరెక్టర్ డాక్టర్ సుదీప్ గుప్తాలు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పు భారతదేశంలో శిశు, బ్లడ్ క్యాన్సర్ చికిత్సకు సంబంధించి అతి పెద్ద కేంద్రాల్లో ఈ బ్లాకు కూడా ఒకటిగా ఉంటుందన్నారు. సుమారు 3.9 లక్షల చ.అ. విస్తీర్ణంలో, అత్యుత్తమ మెడికల్ టెక్నాలజీతో ఏర్పాటయ్యే ఈ అధునాతన కేంద్రం నిర్మాణానికి రూ. 550 కోట్ల పైగా మొత్తానికి కమిట్‌మెంట్‌తో ఐసీఐసీఐ బ్యాంకు నిధులను సమకూరుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, టాటా మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక సమస్యను పరిష్కరించబోయి మరో సమస్యను సృష్టించిన టీటీడీ

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) : ఒక సమస్యను పరిష్కరించబోయి టీటీడీ మరో సమస్యను సృష్టించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి భక్తుల సౌకర్యార్థం, దర్శన టోకెన్ల పంపిణీని శ్రీవారి మెట్టు వద్ద యథాస్థానంలో కానీ, లేదా శ్రీనివాస మంగాపురంలో నిర్వహిస్తే బాగుంటుందని శ్రీవారి మెట్టు మార్గంలో స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలనే ఆలోచన ప్రస్తుత టోకెన్ పంపిణీ విధానంతో నెరవేరడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శ్రీవారి మెట్టు వద్ద పంపిణీ చేసిన టోకెన్లను ప్రస్తుతం తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్‌కు మార్చడం ప్రధాన సమస్యగా మారింది. వేలాది మంది భక్తులు వందల కిలోమీటర్లు నడిచి శ్రీవారి మెట్టుకు చేరుకున్న తర్వాత, టోకెన్ల కోసం అదనంగా 30 కిలో మీటర్ల మేర తిరుపతికి వెళ్లి తిరిగి శ్రీవారి మెట్టుకు రావాల్సి వస్తుంది. ఇది భక్తులకు శారీరక, మానసిక శ్రమను పెంచుతోంది. ఆటో డ్రైవర్ల అధిక వసూళ్లను అరికట్టడానికి టీటీడీ టోకెన్ పంపిణీ కేంద్రాన్ని మార్చింది. అయితే ఇది పాత సమస్యను పరిష్కరించకుండా, కొత్తగా సమస్యను సృష్టించిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై టీటీడీ కానీ, రాజకీయ నాయకులు కానీ, ఇతర అధికారులు కానీ స్పందించకపోవడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీటీడీ అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అమ్మల కష్టాలు చంద్రన్నకు తెలుసు



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : అమ్మల కష్టాలు సీఎం చంద్రన్నకు తెలుసని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా తల్లికి వందనం హామీ నగదును తల్లుల ఖాతాలోకి జమ చేయడాన్ని పురస్కరించుకొని పూసల వీధిలో గల లబ్దిదారుల ఇంటి వద్ద మంగళవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తల్లికి వందనం పిల్లల చదువులకు ఇంధనంగా ఉపయోగపడటంతో తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారన్నారు. శ్రీకాళహస్తిలో నలుగురు పిల్లలు ఉన్న షేక్ ఆశ అనే తల్లి ఖాతాలో రూ.52 వేలు జమ కావడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో దశరథాచారి, మిన్నల్ రవి, నివేదిత మోరె తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానగిరి జీర్ణోద్ధరణ పనులు అద్భుతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనులు అద్భుతంగా జరుగుతున్నాయని మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కితాబిచ్చారు. మంగళవారం అంజూరు జీర్ణోద్ధరణ పనులను పరిశీలించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పనులను కాంట్రాక్టర్ గుమ్మడి బాలకష్ణయ్య నిర్ణీత గడువులోకి పూర్తి చేశారని కొనియాడారు. గతంలో కొండపైకి రావాలి అంటే మెట్ల మార్గం చాలా అవస్థగా ఉండేదని తెలియజేశారు. అయితే పాలకమండలి ఏర్పాటు అయిన తర్వాత భక్తుల కోసం ఎటువంటి అలుపు లేకుండా మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేసామని తెలిపారు. అదేవిధంగా దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటే ఇంకా ఎన్నో అద్భుతాలు చేస్తుండొచ్చని తెలియజేశారు.

సిపిఐ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఆగస్టులో పార్టీ రాష్ట్ర మహాసభ, పెద్ద ఎత్తున బహిరంగ సభ అలాగే సెప్టెంబర్ నెలలో చండీగర్‌లో జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ హమాలీ వర్కర్స్ యూనియన్ పార్టీ శాఖ ఆధ్వర్యంలో అన్నమయ్య సర్కిల్లో బహిరంగ సభ మంగళవారం నిర్వహించారు. ఈ బహిరంగ సభలో హరినాథ రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ప్రజా సమస్యల కోసం సిపిఐ పోరాటాలు చేసిందని తెలిపారు.100 సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలకు నాయకత్వం వహించిందన్నారు.ఈ బహిరంగ సభలో సిపిఐ జిల్లా నగర కార్యదర్శి విశ్వనాథం, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, గోవిందస్వామి, బాబు, సెందిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -కోట : కోట క్రాస్ రోడ్డులోని డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం దగ్గర జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని మంగళవారం వైసీపీ కోట మండల అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణను గూడూరు, సనత్ నగర్, వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం గూడూరుబ రూరల్ మండలం వైసిపి నాయకులు ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-పెళ్లకూరు:పెళ్లకూరు మండలం, చిల్లకూరు వైసీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి జగన్ అంటే నమ్మకం– చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు.

పాలస్తీనాకు సంఘీభావం : సిపిఎం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాలస్తీనా, ఇరాన్‌లపై అమెరికా అండతో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమాన్ని వెంటనే ఆపాలని, సంఘీభావ నిరసనలో భాగంగా జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం తిరుపతి జిల్లా, గూడూరులో సి.పి.ఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని డాక్టర్. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ముందు గూడూరు ప్రాంతీయ కార్యదర్శి జోగి శివకుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇరాన్ మీద ఇజ్రాయిల్ దాడుల నేపధ్యంలో ప్రజలు వేల సంఖ్యలో మృతి చెందుతున్నారని, ప్రపంచ దేశాలు కలుగజేసుకొని వెంటనే యుద్ధం ఆపేలా చూడాలని కోరారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనడంలో మతపరమైన విభజనలకు తావు లేకుండా వ్యవహరించాలని సి.పి.ఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధం వద్దు – ప్రపంచ శాంతి ముద్దు, వర్ధిల్లాలి – మతసామరస్యం, నశించాలి – ఉగ్రవాదం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ నాయకులు, గూడూరు పట్టణ సి.ఐ.టి.యు అధ్యక్ష, కార్యదర్శులు పామంజి మణి, బి.వి.రమణయ్య, భవన నిర్మాణ సంఘ సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, కె.వి.పి.ఎస్ నాయకులు అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య, ఎంబేటి చంద్రయ్య, గుర్రం రమణయ్య, ఆటో సంఘం నాయకులు వి.భాస్కర్ రెడ్డి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నగర పరిధిలోని వేదాంత పురం సబ్ స్టేషన్‌లో 33/ 11 కె.వి. ఈ.ఎస్.ఐ విద్యుత్ ఫీడర్ మరమ్మతులు కోసం 18వ తేది బుధవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపి ఎస్పీ.డి.సీ.ఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ధనలక్ష్మి నగర్, కలశం బిల్డింగ్ వేదాంతపురం, అవిలాల తదితర ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

తల్లికి వందనం మున్సిపల్ కార్మికులకూ వర్తింప చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : తల్లికి వందనం మున్సిపల్ కార్మికులకు కూడా వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 18వ తేదీ నిర్వహించనున్న ర్యాలీలు, ధర్నాలు జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కోసం జారీ చేసిన జీవో నెంబర్ 26 ప్రకారం మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులకు ఆదాయపరిమితితో నిమిత్తం లేకుండా చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులకు తల్లికి వందనం పడేంత వరకు, జీతాలు పెంపుదల చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు.

కోవిడ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష

ప్రజాశక్తి - తిరుపతి సిటీ :శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్శిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి.కుమార్ అధ్యక్షతన డైరెక్టర్ మీటింగ్ హాల్‌లో కోవిడ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ స్విమ్స్ హాస్పిటల్‌లో కోవిడ్ పేషెంట్లకు కావల్సిన వైద్య సామగ్రిని, బెడ్లను సిద్ధం చేసుకోవాలని, కోవిడ్ పేషెంట్ల కోసం ఇప్పుడు ఉన్న 6 బెడ్లను మరింత పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, మెడికల్ సూపరింటిండెంట్ డాక్టర్ రామ్, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సమంత్ రే, మైక్రోబయాలజీ విభాగాధి పతి డాక్టర్ వెంకటరమణ, కోవిడ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ తదితర వైద్యులు పాల్గొన్నారు.

తల్లికి వందనం అందని వారిని ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి - నాయుడుపేట: తల్లికి వందనం పథకంలో అనర్హత వేటుపడ్డ అభాగ్యులను ఆదుకోవాలని నాయుడుపేట సిపిఎం పార్టీ నాయకులు ఎస్.ముకుంద కోరారు. నాయుడుపేట మున్సిపాలిటీలో అనేక ఆంక్షలతో లబ్ది పొందని పేద వారు సుమారు 1500 మంది వరకు ఉన్నారన్నారు. తల్లికి వందనం పథకంలో చాలా అవకతవకలు జరిగాయని, ఈ పథకానికి అర్హులను గుర్తించడంలో ప్రభుత్వం చాలావరకు విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా అర్హులైను గుర్తించి తల్లికి వందనం అందించాలని కోరారు. మున్సిపాలిటీ కమిషనర్ సర్వే చేయించి అర్హులైన లబ్ధిదారులకు పథకం అందేలా చూడాలన్నారు. గరిడి వీధి సచివాలయం, అడ్మిన్ అత్తర్‌ను మంగళవారం కలిసి ఈ పథకానికి సంబంధించిన లిస్టును ఇవ్వవలసిందిగా కోరగా, చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. లబ్దిదారుల లిస్టు ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించగా, ఎవరికి ఇవ్వకూడదని ముఖ్యంగా విలేకరులకు ఇవ్వకూడదని కమిషనరే స్వయంగా చెప్పారని బదులిచ్చారు. ఈ విషయాన్ని మునిసిపల్ కమీషనర్ ఫజిలుల్లా దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా దానిపై అంతగా స్పందించలేదన్నారు. లబ్దిదారుల లిస్టు అందుబాటులోకి తేవాలని, అర్హులకు న్యాయం చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ముకుంద హెచ్చరించారు.

లిక్కర్ స్కాంలో చెవిరెడ్డి..?

బెంగుళూరు ఎయిర్‌పోర్టులో అదుపులోకి

ప్రజాశక్తి - రామచంద్రాపురం : వైసిపి హయాంలో జరిగిన మద్యం కుంభకోణం ముడుపుల రవాణాలో చంద్రగిరి మాజీ శాసనసభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి సంబంధం ఉన్నట్లు సిట్ అధికారులు లుకౌట్ నోటీసులను జారీ చేశారు. మంగళవారం వ్యాపార పనుల నిమిత్తం బెంగుళూరు నుంచి కొలంబోకు వెళ్లేందుకు బెంగుళూరు ఎయిర్‌పోర్టులో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేష్ నాయుడులను ఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకుని ఝలక్ ఇచ్చారు. దీంతో బెంగుళూరు విమానాశ్రయం నుంచి విమానాశ్రయ పోలీసులు విజయవాడ సిట్ అధికారులకు సమాచారం ఇచ్చి, విదేశాలకు వెళ్లేందుకు వీల్లేదని, ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వెళ్లడానికి అవకాశం లేదని, సిట్ అధికారులు వచ్చేంత వరకూ ఎయిర్‌పోర్టులోనే ఉండాలని పోలీసుల అదుపులో ఉంచుకున్నారు. తిరుపతి సిట్ పోలీసులు బెంగుళూరు చేరుకుని, నేరుగా విమానంలో విజయవాడకు చెవిరెడ్డిని తీసుకెళ్లారు. విజయవాడ సిట్ ప్రధా న కార్యాలయంలో చెవిరెడ్డిని విచారించి అనంతరం అరెస్టు చూపనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు ఇచ్చిన లుకౌట్ నోటీసులు, బెంగుళూరు ఎయిర్‌పోర్టులో అదుపు లోకి తీసుకున్న సంఘటనపై హైకోర్టును చెవిరెడ్డి ఆశ్రయించినట్లు సమాచారం. చెవిరెడ్డిని అరెస్టు చేశారని సోషల్ మీడియాలో వార్తలు రావడంతో చంద్రగిరి పోలీసులు అలర్ట్ అయ్యారు.

పోలీసులు చిత్రహింసలు పెట్టారు : హెచ్‌సి మదన్‌రెడ్డి

మద్యం కేసులో సాక్షిగా సిట్ ఎదుట విచారణకు హాజరైతే పోలీసులు చిత్రహింసలకు గురిచేశారంటూ వైసిపి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గన్‌మెన్‌గా చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎన్ మదన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ అధికారులు చెప్పినట్లుగా వాంగ్మూలం చెప్పాలని బెదిరించారని, తనకు న్యాయం చేయాలంటూ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ నూనెపల్లి హరినాథ్ మంగళవారం విచారించారు. మద్యం విధానం కేసులో సాక్షిగా తమ ఎదుట హాజరుకావాలని సిట్ అధికారులు నోటీసులు ఇస్తే పిటిషనర్ ఈ నెల 10న హాజరయ్యారని, రాజకీయ నేతల పేర్లు చెప్పాలని ఒత్తిడి చేశారని చెప్పారు. ఇప్పటికే పలువురు సాక్షులు తాము చెప్పినట్లుగానే వాంగ్మూలాలు ఇచ్చారని, చెవిరెడ్డికి రూ.200 కోట్లు అందినట్లు చెప్పాలని బెదిరించారని, ప్రలోభాలకు కూడా గురిచేశారని చెప్పారు. ఒత్తిళ్ల కారణంగా ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రిలో చేరాల్సి వచ్చిందన్నారు. న్యాయవాది సమక్షంలో విచా రించేలా ఉత్తర్వులివ్వాలన్నారు. సిట్ వాదనల నిమిత్తం విచారణ బుధవారానికి వాయిదా పడింది.

మదన్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం : సిట్

ఎఆర్ కానిస్టేబుల్ మదన్‌రెడ్డి తమపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని సిట్ అధికారులు పేర్కొన్నారు. విచారణ సమయంలో సిట్ అధికారులకు సహకరించకుండా, సిట్ అధికారుల పేర్లు రాసి చనిపోతానని బెదిరించాడన్నారు.

207 మందికి టిడిఆర్ బాండ్లు పంపిణీ

తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ పరిధిలో మాస్టర్‌ప్లాన్‌రోడ్లలో స్థలాలు కోల్పోయిన వారికి 207 మందికి టిడిఆర్ బాండ్లను పంపిణీ చేశామని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. పారదర్శకంగా బాండ్లు పంపిణీ చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. మంగళవారం ఆన్లైన్ ద్వారా నిర్వహించిన కమిటి సమావేశంలో మరో 187 మందిని ఎంపిక చేశామన్నారు. వీరంతా గిఫ్ట్ డీడ్ ఇచ్చిన వెంటనే బాండ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిసిపి మహాపాత్ర, ఏసిపిలు బాలాజి, మూర్తి పాల్గొన్నారు.

వినాయకసాగర్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయండి

వినాయకసాగర్ అభివృద్ధి పనుల్లో పెండింగ్‌ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్విమ్మింగ్‌పూల్, గ్లోగార్డెన్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు నాటాలని సూచించారు. సాగర్‌ను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ.రవి, డి.ఈ. రమణ, రాజు, వెంకట ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్రైం న్యూస్

అత్తను హత్య చేసిన అల్లుడు అరెస్ట్



మోహన్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అత్తను హత్య చేసిన కేసులో అల్లుడిని అరెస్ట్ చేశామని సిఐ సురేంద్ర నాయుడు తెలిపారు. మంగళవారం సిఐ విలేకరులకు వివరాలు వెల్లడించారు. పుత్తూరు మండలం, కళ్యాణపురం ఎస్టి కాలనీకి చెందిన నరసమ్మ కుమార్తె భర్త చంద్రగిరి నియోజకవర్గంలోని చందమామల పల్లి యానాది కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు మోహన్(26) మద్యానికి బానిసై తరచూ తన భార్యను చిత్ర హింసలకు గురి చేసేవాడని తెలిపారు. దీంతో వారి మధ్య ఘర్షణ జరిగినప్పుడల్లా ఆమె పుట్టింటికి వెళ్ళేదన్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్ళిందన్నారు. మోహన్ తన భార్యను కాపురానికి పంపాలని అత్త నరసమ్మ (53)ను కోరాడన్నారు. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదనలు చోటుచేసుకున్నాయన్నారు. కోపోద్రిక్తుడైన మోహన్ పక్కనే ఉన్న దుడ్డు కర్ర తీసుకొని నర్సమ్మను బలంగా కొట్టాడన్నారు. తీవ్ర రక్తస్రావాన్ని గురైన నరసమ్మ అక్కడే రక్తపు మడుగులో పడిపోయిందని తెలిపారు. బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స తీసుకుంటూ ఈనెల ఆరో తేదీ మృతి చెందిందని సిఐ తెలిపారు. మృతురాలు కుమారుడు వెంకటేష్ ఇచ్చిన పిర్యాదు మేరకు హత్యా నేరం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పరారీలో వున్న మోహన్‌ను ఈనెల 17వ తేదీ తడుకు బస్టాప్ వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు సిఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంటు నుండి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) మండలంలోని మిట్టపాలెం సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ గుణశేఖర్ నుండి తనకు రక్షణ కల్పించాలని, అదే సచివాలయంలో పనిచేస్తున్న ఎన్ఎం అన్నపూర్ణ మంగళవారం పోలీసులును ఆశ్రయించింది. తనతో పాటు పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ గుణశేఖర్ తన పని తాను చేసుకోకండా నా పనిలో తలదూర్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తాను చెప్పినట్లు పని చేయాలని నన్ను లైంగికంగా లొంగదీసుకోవటానికి ప్రయత్నిస్తూ ఉండటంతో నేను అతనికి వార్నింగ్ ఇచ్చానని ఫిర్యాదులో పేర్కొంది. అప్పటినుండి నన్ను నీచంగా మాట్లాడుతూ మిట్టపాలెం నుండి నిన్ను కుప్పానికి బదిలీ చేయిస్తానని బెదిరిస్తున్నాడని ఇతనితో గొడవ వద్దనుకొని ఓర్పుగా ఉన్నా అతని ప్రవర్తనలో మార్పు కనిపించలేదని ఆమె తెలిపింది. మంగళవారం గుణశేఖర్ నా పని నేను చేసుకుంటూ ఉండగా నువ్వు ఏదో మెసేజ్ పెట్టావట నా వెనక రాజకీయ నాయకులున్నారు. నిన్ను నెరబైలుకు బదిలీ చేస్తాను అక్కడ చెట్టు కింద పడుకుని నిద్రపో లేకుంటే సత్యవేడు పంపిస్తాను నా గురించి నీకు తెలియదు నీ అంతు చూస్తానంటూ ప్రతిరోజు బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. నేను తనకు లొంగలేదని ప్రతిరోజు నన్ను హింసిస్తున్నాడని గుణశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని అన్నపూర్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాబరీ కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఓ రాబరీ కేసులో నిందితుడిగా ఉండి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న హేమంత్ అనే వ్యక్తిని మంగళవారం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏఎం పుత్తూరుకు చెందిన హేమంత్ ఓ రాబరీ కేసులో నిందితుడుగా ఉన్నాడు. కోర్టుకు హాజరు కాని నేపథ్యంలో న్యాయమూర్తి అరెస్ట్ వారెంట్ జారీ చేయగా, పోలీసులు హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. న్యాయమూర్తి ముందు హాజరు పరచగా, రిమాండ్ విధించడంతో శ్రీకాళహస్తి సబ్ జైలుకు తరలించారు.

'జెఇఇ 2022' పరీక్ష రద్దుతో... మనస్తాపంతో అగ్రశ్రేణి విద్యార్థి ఆత్మహత్య



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పోటీ పరీక్షలో అగ్రశ్రేణిలో ఆలిండియా ఐదో ర్యాంకు సాధించి, 'జెఇఇ' పరీక్ష నిర్వహణ లోపభూయిష్టంగా ఉందని ప్రభుత్వం పరీక్షను రద్దు చేయడంతో న్యాయ పోరాటం చేసి మనస్తాపం చెందిన మాథూర్ (26) ముంబాయిలోనే పీజీలో సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తన కొడుకు మృతిచెందాడని తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. మాథూర్ నగరి నియోజకవర్గం పుత్తూరు నివాసి. బిటెక్ పూర్తి చేశాడు. అనంతరం బ్యాంకు సంబంధించి పోటీ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించి ముంబాయి బ్రాంచి ఎస్‌బిఐ బ్యాంకు ఐటి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుండేవాడు. అయితే 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' పోటీ పరీక్షను 2022లో రాసి, ఆలిండియా ఐదో ర్యాంకు సాధించాడు. పోటీ పరీక్ష అనంతరం ఎటువంటి సమాచారం, పురోగతి లేకపోవడంతో కోర్టును ఆశ్రయించాడు. అయితే జెఇఇపరీక్ష నిర్వహణ లోపభూయిష్ఠంగా ఉందని ప్రభుత్వం పరీక్షలను అప్పట్లో రద్దు చేసింది. దీంతో ఉత్తమ ర్యాంకు సాధించిన మాథూర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. న్యాయ పోరాటం చేశాడు. తన కష్టం, తాను సాధించిన ర్యాంకు వృథా అయ్యిందని మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి ముంబాయిలోని పీజీలో సూసైడ్‌నోట్ రాసి, ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయాడు. మాథూర్ తల్లిదండ్రులు ఫోన్ చేసినా, ఫోన్ తీయకపోవడంతో అనుమానంతో పీజీ యజమానులకు ఫోన్ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్వర్ణలత, ఎన్ఎస్ జార్జ్ బోరున విలపిస్తూ ముంబాయి బయల్దేరారు. అక్కడకేసు నమోదు చేసుకున్న పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. తన కుమారుని మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తమ బిడ్డకు జరిగినట్లు అన్యాయం మరే ఇతర విద్యార్థికీ జరగరాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్పందించి, తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.